# వేదాంతభేరి

జూలై 2020

రూ. 10/-



Scanned with CamS

ధ్యానకాలమున మనస్సు ఏకాగ్రముగ నుండనిచో ఆత్మానందమనుభూతము కానేరదు. మనస్సు ఏకాగ్రముగ నుండవలెననిన ఇంద్రియములు బహిర్వ్యాపారమును మాని, శబ్దస్పర్శాది విషయములపై పరుగిడక అంతర్ముఖములు కావలెను. అంతర్ముఖములు కావలెననిన, విషయానందములందు దుఃఖ దోషానుదర్శనమును గావింపవలెను.

వైరాగ్యభావనచే ఇంద్రియములు, మనస్సు బాహ్య వ్యాపారములనుండి మఱలి అంతర్ముఖులై ఆత్మారాములైనచో ఆత్మాధ్యానమున కెంతయో సహాయకారులు కాగల్గును.

– శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు

# ఓం వేదాంతభేరి ఓం


సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 53 జూలై 2020 సంచిక : 07



సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,



శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు ) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :



శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239


చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.


Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ **వేదాంతభేరి** ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 53 జూలై 2020 సంచిక : 07

## విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. గురుపౌర్ణమి - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. సద్గురు బోధ - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 10
04. శ్రీరామకృష్ణ బోధామృతము - శ్రీరామకృష్ణ పరమహంస - 14
05. సాధన పంచకము - శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు - 15
06. సకల జనవంద్య !గురుదేవశరణు శరణు- డా॥ సముద్రాల లక్ష్మణయ్య-18
07. సంసారం మహాసాగరం - శ్రీసర్వాత్మానందగిరిస్వాములవారు - 20
08. శ్రీ సద్గురువు మలయాళస్వాములవారి సంఘసేవ
 - శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు -25
09. వేదాన్త సారము - స్వామి సదానంద యోగీంద్రుడు - 31
10. భాగవతం షష్ఠస్కంధము-శ్రీమాతా పరావిద్యానందగిరిస్వామినివారు-36
11. అమృతానుభవము - జ్ఞానేశ్వర్ మహరాజ్ - 39
12. చిందులు త్రొక్కు ప్రాణి - 40
13. వాదన - వేదన -డా॥ పులివర్తి కృష్ణమూర్తి - 41
14. వార్తలు - 42

### ముఖచిత్రం

### శ్రీ సద్గురు మహర్షి మలయాళ స్వాములవారు

1. జూలై 1వ తేది శ్రీ సద్గురు మలయాళస్వాములవారి ఆరాధన.
2. జూలై 5వ తేది గురుపూర్ణిమ - వ్యాసపూర్ణిమ.
3. జూలై 16వ తేది దక్షిణాయనం ప్రారంభము
4. జూలై 20వ తేది చౌడేశ్వరి జయన్తి

**ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు**



## ప్రార్థన

1. ఓం మందస్మితస్ఫురిత ముగ్ధ ముఖారవిన్దం ।
కందర్పకోటిశత సుందర దివ్యమూర్తిమ్ ।
ఆతామ్రకోమలజటాఘటితేందురేఖం
ఆలోకయే వటతటీనిలయం దయాళుమ్ ॥

2. ఓం నమః ప్రణవార్థాయ శుద్ధజ్ఞానైకమూర్తియే ।
నిర్మలాయ ప్రశాన్తాయ దక్షిణామూర్తియే నమః ॥

3. ఓం ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేద విభాగినే ।
వ్యోమవద్వ్యాప్తదేహాయ దక్షిణామూర్తియే నమః ॥

4. ఓం నమామి సద్గురుం శాన్తం ప్రత్యక్షం శివరూపిణమ్
శిరసా యోగపీఠస్థం ముక్తికామార్థసిద్ధిదమ్ ॥

5. ఓం అచింత్యావ్యక్తరూపాయ నిర్గుణాయ గుణాత్మనే ।
సమస్త జగదాధారమూర్తయే బ్రహ్మణే నమః ॥

6. ఓం బ్రహ్మాత్మగం ప్రణవబోధవిచారశీలం
నిత్యాత్మతత్త్వ మునిసేవ్య మఖణ్డభావమ్ ॥
ప్రజ్ఞానేత్రదమనుత్తమ భక్తరాశేః
మల్యాళమౌనివరమాత్మని చిన్తయే ఽహమ్ ॥

7. ఓం సో ఽహంభావముపాశ్రిత్య హంసీభూతో గురూత్తమః
మలయాళయతిర్నిత్యం మానసే రమతాం మమ ॥

8. శ్రీమదసంగానంద స్వామికి మలయాళ దేశ సంభూతునకున్
వేమారు వందనము లిడి స్వామీ ! మముగావుమనుచు సంస్తుతి సేతున్

9. కరుణాకర ! గుణజలధీ ! వరయోగిజనాగ్రగణ్య! వాంఛితఫలదా!
గురువర! మలయాళయతీ! నిరతము నిను దలచువాడ నిరుపమశీలా ।

# గురుపౌర్ణమి

**– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు**

(ఆంధ్రప్రభ వారపత్రిక డిప్యూటీ ఎడిటర్ గారు ఇదివరలో శ్రీస్వాములవారిని అడిగిన కొన్ని ప్రశ్నలకు శ్రీవారు ఒసంగిన సమాధానములు ఇచట పొందుబరచబడినవి. – సం ॥

**గురువు లక్షణాలు ఏవి ?** గురువు పవిత్రమైన ఆచరణ కలిగియుండవలెను. ఆధ్యాత్మిక సాధనలు చక్కగ జరిపినవాడై, ఇంద్రియములపైనను, మనస్సుపైనను విజయమును సంపాదించి యుండవలెను. తన హృదయమందు ఏమాత్రము అసుర సంస్కారములకు అవకాశిమివ్వని వాడై యుండవలెను. అచంచలమైన దైవభక్తి, భగవంతుని యెడల పరిపూర్ణ విశ్వాసము కలిగియుండవలెను. నిరహంభావము కలిగి వర్తింపవలెను. పెద్దల యొక్క ఆచరణను ఇతరులు అనుసరించుదురు. కావున గురువులు పవిత్ర హృదయులై యుండవలెను. ఇతరులకు ఆదర్శము చూపువారై యుండవలెను. ఆచరణ యందేమియు లోటుపాట్లు లేక అది నిర్దుష్టముగ యుండునట్లు చూడవలెను.

**గురువును ఎట్లా ఎన్నుకోవాలి ? ఏ వయస్సులో వెతుక్కోవాలి?**

పైన తెలిపిన సల్లక్షణములు గల మహనీయునే గురువుగ ఎన్నుకొనవలెను. అట్టి పవిత్రహృదయులు ఎచట యున్నారో వెతకి వెతకి వారి ఆచరణను పరీక్షించి ఆ తదుపరియే వారిని గురువుగ ఎన్నుకొనవలెను. చక్కని అనుష్ఠానము గలవారినే గురువుగ స్వీకరించుట మంచిది.

గురువును ఎన్నుకొనుటయందు వయస్సుయొక్క పరిమితి



ఏమియు లేదు. బాల్యమందుగాని, యవ్వనమందుగాని, వార్ధక్యమందుగాని ఎప్పుడైనను ఎన్నుకొనవచ్చును. తాను బంధమందున్నాడనియు, బంధవిముక్తిని పొందవలెననియు, త్వరలో విముక్తిని బడయవలెననియు ఎపుడు కాంక్షించునో అపుడు వెంటనే గురువును అన్వేషించి, ఎన్నుకొని వారి బోధలను ఆలకించి, ఆచరించి తరించవలెను. సాధ్యమైనంతవరకు బాల్యయవ్వనములందే గురుదేవుని ఆశ్రయించుట మంచిది.

**మీ గురువుల గురించి ఏమైనా చెబుతారా ?**

మా గురుదేవులు మహర్షి సద్గురు శ్రీ మలయాళస్వాములవారు. వారు 1885వ సంవత్సరమున కేరళదేశమునందు జన్మించి 77 సంవత్సరములు జీవించి 1962వ సంవత్సరమున బ్రహ్మైక్యము పొందిరి. వారు కేరళదేశమందు జన్మించినప్పటికి ఆంధ్రదేశమున తిరుమల పుణ్య క్షేత్రమున గోగర్భమందు 12 సంవత్సరములు తీవ్రమగు తపస్సు నాచరించి గొప్ప ఆధ్యాత్మికానుభూతిని బడసిరి. తదుపరి శ్రీకాళహస్తి సమీపమున గల 'ఏర్పేడు' గ్రామముయొక్క పరిసరమున ఒక పవిత్ర స్థలమునందు **'శ్రీవ్యాసాశ్రమము'** అను పేరిట ఒక చక్కని ఆశ్రమమును ఏర్పాటు చేసుకొని ఆంధ్రదేశములో గొప్ప ఆధ్యాత్మిక ప్రచారమును గావించిరి. తెలుగు భాషలో పెక్కు ఆధ్యాత్మిక గ్రంథములను రచించిరి. వారు అనుష్ఠానపరులు. శాస్త్రములందు బోధింపబడిన సిద్ధాంతములను ఆచరణయందుంచి, స్వయముగ అనుష్ఠించి, అనుభూతిని బడసి తదుపరియే ఇతరులకు బోధించుదురు.

**నేటి జీవన వేగంలో పాతకాలపు గురు –శిష్య సంబంధాలు సాధ్యమా ?**

**తప్పక సాధ్యమగును :** ఆధునిక సమయమున భారతదేశమునందు ఎన్నియో పవిత్రమైన ఆశ్రమములు విరాజిల్లుచున్నవి. అనుష్ఠానపరులై నట్టియు, అనుభవజ్ఞులైనట్టియు ఎందరో మహనీయులు, గురువులు తమ శిష్యులకు



Scanned with CamS

చక్కటి ప్రబోధము సలుపుచున్నారు. వారి దివ్యబోధలను ఆలకించి ఎందరో పరమశాంతిని బడయుచున్నారు.

**ఆధ్యాత్మిక విషయాలలోనే కాకుండా లౌకిక విషయాలలో కూడా శిష్యుడికి గురువు సహాయం యుంటుందా?** లౌకిక సంబంధమైనను గురువు తనకు తెలిపియున్న ఉత్తమ భావములను శిష్యునకు చెప్పవచ్చును. క్రమశిక్షణను గూర్చి, సమాజముయొక్క నైతిక అభ్యున్నతిని గూర్చి గురువు శిష్యునకు బోధించవచ్చును.

**అత్యధికులు అన్న వస్త్రాలకు అలమటిస్తూన్నపుడు ఆధ్యాత్మిక ధోరణి పలాయనవాదం-అన్న విమర్శ యుంది, దానికి జవాబుయుందా?** ఆధ్యాత్మిక సత్యములు ఏనాడును పలాయనము చిత్తగించవు. అవి త్రికాలములందును పరమసత్యములైన సిద్ధాంతములు. ప్రతి జీవికిని శరీరము ఒకటియే కాదు, ఆత్మ కూడ కలదు. శరీరముయొక్క ఆరోగ్యము కొరకు, ఆత్మయొక్క అనుభూతి కొరకు మానవుడు ప్రయత్నించవలెను. శరీరమును ఉపేక్షించినచో ఆత్మానుభూతికై ప్రయత్నించుటకు వీలుపడదు. కాబట్టి అన్న వస్త్రాదులను ధర్మపూర్వకముగ సంపాదించుకొని, ఆరోగ్యమును చక్కగ కాపాడుకొని, ఆత్మానుభూతికై సాధనలు సలిపి, స్వస్వరూప ఆత్మసాక్షాత్కారముచే ముక్తిని బడయవలెను.

శరీరమునకు అత్యంతావశ్యకములైన అన్నపానాదులను ఉపేక్షించుడని పెద్దలుఎవరును చెప్పరు. వాటికొరకై ప్రయత్నించి ఆరోగ్యమును కాపాడుకొనవలసినదే. బీదలకు అన్నవస్త్రాదుల నొసంగుటకై సహాయ పడవలసినదే. అయితే ఆత్మ ఒకటి గలదనియు, అది అన్నిటికంటె ముఖ్యమైనదనియు, దానిని సాక్షాత్కరించుకొనుట వలన పరిపూర్ణ దుఃఖ రాహిత్యము, ఆనందప్రాప్తి కలుగుననియు ఎవరును మరువరాదు. "Man does not live by bread alone". "కేవలము రొట్టె చేతనే మానవుడు జీవించుట లేదు"- అను పెద్దల వాక్యమును విస్మరించగూడదు.



**వరకట్నం, అస్పృశ్యత, అవినీతివంటి సామాజిక సమస్యల పరిష్కారంలో గురువులు మరింత చొరవ తీసుకోవాలి అన్న సూచనకు తమరు ఏమంటారు?**

దురాచారములు సంఘములోగాని, సమాజములోగాని, లేక మరెచటనుగాని యున్నప్పటికిని వాటిని దూరీకరించుట, మానవాళిలో సంతుష్టిని నెలకొల్పుట – కేవలము గురువుల యొక్కయే కాదు, ప్రతివారి యొక్క విధ్యుక్త కర్తవ్యమైయున్నది.

**గురుపౌర్ణమి సందర్భముగ తమ ప్రత్యేక సందేశమేమి?**

**ఆషాడ శుద్ధ పౌర్ణమి 'గురుపౌర్ణమి'**గ పరిగణింపబడును. దానినే 'వ్యాసపౌర్ణమి' అని కూడా అందురు. ఆ గురుపౌర్ణమినాడు ప్రతివారు వారి వారి గురుదేవులను ఆరాధించుటయు, పూజాదులు జరుపుటయు సంభవించుచుండును. గురుదేవులు బోధించిన గొప్ప ఆధ్యాత్మిక సిద్ధాంతములను గూర్చి పరస్పరము సంభాషించుకొనుటయు, వాటిని తాము ఎంత వరకు అనుష్ఠించినది పరీక్షించుకొనుటయు ఆ దినమున జరుగుచుండును. అయితే సంవత్సరములో ఒక్క గురుపౌర్ణమినాడే ఈ విధముగ జరుపవలెనని అర్థము కాదు. **సంవత్సరములోని ప్రతిదినమును కూడా 'గురుపౌర్ణమి'గ భావించి గురుబోధలను ఆచరణయందుంచు కొనుచుండవలెను.**

పౌర్ణమి దినము పూర్ణత్వమును సూచించును. పౌర్ణమి దినము రాత్రింబగళ్లు ప్రకాశవంతముగనేయుండును. అట్లే మానవుడు తన యావజ్జీవితమును ప్రకాశవంతముగ ఒనర్చుకొనవలెను. అంధకారమునకు చోటీయరాదు. అజ్ఞానమును దరికిచేర్చరాదు. అపుడే మానవునకు పరమశాంతి, పరిపూర్ణ ఆనందము లభించును. అట్టి స్థితియే జీవిత లక్ష్యము. **(1992 వేదాన్తభేరి నుండి).**



Scanned with CamS

# సద్గురు బోధ

- శ్రీ మహర్షి మలయాళస్వాములవారు

1. విద్యలేనివారు పశుప్రాయులని కొందఱు చెప్పుచుందురు. కాని విద్యయుండియు జ్ఞానము లేనివారు పశువులకన్న కనిష్ఠులే. ఇది మఱువకుఁడు.

2. ఒక ప్రభువైనవాని సేవకులు మొదలైన వారలందరును. ప్రభువు యొక్క సౌఖ్యమును కోరి వర్తించవలసియుండుటయే ధర్మము. ప్రభువునకు ద్రోహము చేయు నౌకరులను వెంటనే దండించుట లేక నౌకరి నుండి తొలగించుట ధర్మము. అట్లే ఆత్మయగు ప్రభువు యొక్క స్వసౌఖ్యమునకు విరుద్ధముగా దుష్ట విషయములఁ బ్రవర్తించు నింద్రియములను భృత్యులను శిక్షించుట జేయువాఁడు మాత్రమే ఆత్మ సౌఖ్యము నొందగలుగును.

3. విషయములనుభవించుచునే యుండి (సంసారములోనే యుండి) ఆ విషయములందు మనోజయము గలుగవలెనని వాదించెడివారు, నదీ ప్రవాహములో కొట్టుకొని పోయెడి పడవలో నుండు బాలురు దానియందుండీ పడవను గట్టిగా బట్టుకొని నిలుపఁగోరినట్లు, వ్యామోహమేగాని, ఫలము గలుగదు. పడవ సముద్రమున ప్రవేశించి మునుఁగునట్లు వీరును సంసార సాగరములో పతితులగుదురు.

4. ముముక్షువైనవాడు అనేక విధ సాధనలు చేయంబనిలేదు. ఒక దానియందు పట్టుదలతో అనుష్ఠానము చేసెనేని తరింపవచ్చును. ఆకలిగలవాడు ప్రపంచములోగల అన్ని ధాన్యాన్నములను తినబని లేదు. ఏదైన ఒక అన్నము తినకుండిన జీవింపజాలడు గదా! రోగము గలవాడు వైద్యశాస్త్రములో చెప్పబడిన యావత్తు ఔషధములను పథ్యములును శీలింపబనిలేదు. రోగమునకు తగిన ఒక ఔషధ సేవ, పథ్యము లేనిచో బ్రతుకజాలడుగదా. దాహము గలవాడు ప్రపంచములో గల అన్ని తీర్థములను త్రాగబనిలేదు, ఒక తీర్థమైనను త్రాగనిచో నిలువ జాలనట్లు ఒక్కదానియందు పట్టుదలతో అనుష్ఠించిన ముక్తి నొంద వచ్చును.

5. మనస్సు చేయు చేష్టల నేకాంతముగ కూర్చుండి జాగ్రత్తతో నిరీక్షించుచుండిన మనోజయము త్వరలో సిద్ధించును.

6. తామర పుష్పము వికసించునపుడు దళములు తమకు తామే వీడిపోయి కాయ శేషించి నిలుచునట్లు హృదయము వికసించు నపుడు సమస్తావరణములు అనఁగా వృత్తులు స్వయముగా వదలి పోయి స్వస్వరూపమగు ఆత్మ మాత్రమే శేషించి యుండును. కాని కమలము వికసించుటకు సూర్యరశ్మి కావలసియుండునట్లు, హృదయము వికసించుటకు సర్వేశ్వర కరుణాకటాక్ష దృష్టి యుండవలయును.

7. సముద్రాంతర్గతమగు ముత్యపుచిప్ప స్వాతికార్తిక వర్షబిందువుకై నోరు తెరచుకొని సాగరోపరి భాగములో నిరీక్షించుచుండునట్లు, ఎవని మనస్సు సంసార సాగరమునుండి సర్వేశ్వరకరుణామృత పానము కొరకు నిరీక్షించుచుండునో, అటువంటివాడే తీవ్ర భక్తుడని గ్రహింపుఁడు.ముత్యపుచిప్ప గ్రహించినజలము ముత్యమై పరిణమించునట్లు, దైవ కరుణయే మాణిక్యమనియు, భక్తియే చింతామణియనియు,వైరాగ్యమే రత్నమనియు గ్రహింపుము.

8. ఒక నిముషమైనను భగవంతుని స్మరింపక వ్యర్థమై పోవునపుడు ఎవని నేత్రముల నుండి ధారధారగా నీరు ప్రవహించునో ఆ





Scanned with CamS

పుణ్యాత్ముడే మానవజన్మముయొక్క మహిమ తెలిసినవాడనియు యథార్థమైన దైవభక్తుడనియు, తరింపగవాడనియు, ఇతరుల తరింపచేయువాడనియు, తీవ్ర వైరాగ్యము కలవాడనియు మరువకుడు. తదితరుల జన్మములు తమకును, యితరులకును భూమికిని భారమే యగును.

9. చాలా రోజులు వర్షము లేక ప్రపంచమంతయు తపించియుండి నప్పుడు, ఒక్క సమయమున సంపూర్ణముగా వర్షము కురిసిన లోకమేలాగున ఆనందభరితమై యుండునో ఆలాగున చిరకాలానుష్ఠానపరుడయ్యు జ్ఞానము గలుగక పరితపించు చుండినను, దైవకృపగలిగిన ఒక నిముషములో సమస్త దుఃఖములు నశించి బ్రహ్మానందభరితుడు గాగలడు.

ప్రణతి

## సద్గురు మహర్షి మలయాళ సంయమీంద్ర !

- శ్రీ కొక్కిలి లింగరాజుగారు

ఆంధ్రసాహితీ ప్రచారసభ, టీటాఘర్, పశ్చిమబెంగాల్

విశ్వమానవ కల్యాణ విభవ లక్ష్య
సాధనాయత్త చిత్త ప్రశాంతి నీది,
సర్వ సంగ పరిత్యాగ సహన శీల
ధారణ నియుక్త సర్వాంగ దాంతి నీది !
తను వచో మానస త్రికరణ విశుద్ధి
జీవలోక సేవాంకిత పావనాతి
పావనంబైన ధన్యజీవనము నీది !
సద్గురు మహర్షి మలయాళ సంయమీంద్ర!

సకల విబుధజనాదర్శ సంయమీంద్ర
పరమ పురుషావతార జీవనము నీది
మాదృశానేక సంసార మగ్నజీవి
కలకలం గేలూత నిడు కనికరము నీది !
బహువిధాధ్యాత్మిక జ్ఞాన పథిక యోగ
సాధకానీక సహకార చర్య నీది,
అహరహస్స్వయంకృత శిష్య సహిత నిజమ
నః ప్రవృత్త్యంత రన్వేషణమ్ము నీది!

అను నిమేష నిజప్రవర్తన విమర్శ
నాన్వితాత్మ పరీక్షా జయమ్ము నీది,
సర్వ భారత ధారుణీ చక్రమందు
సత్యధర్మ సంస్థాపనాశయము నీది,
ప్రేమ సౌజన్య ధన్య చరిత్ర నీది,
త్యాగ వైరాగ్య సేవాపథమ్మునీది
పరమ ధర్మార్థ విద్యా తపస్సు నీది!
సద్గురువరేణ్య ! నీ పదాశ్రయము నాది !

## సర్వమత సారము

ప్రతి జీవియు శక్తివంతమైన దివ్యమగు ఆత్మస్వరూపము. బాహ్య, అభ్యంతర ప్రకృతులను వశపర్చుకొని అట్టి దివ్యత్వమును వ్యక్తపఱచుటయే జీవుని లక్ష్యము. ఇట్టి లక్ష్యమును కర్మచేకాని, లేక ఉపాసనచేగాని, లేక మనోనిగ్రహముచే గాని, లేక తత్త్వ జ్ఞానముచేగాని, వీనిలో ఒకదానిచేగాని, కొన్నిటిచేగాని లేక అన్నిటిచే గాని సాధించి విముక్తుడవుకమ్ము. సమస్త మతముల యొక్క సారాంశమిదియే.

- స్వామి వివేకానంద

# శ్రీరామకృష్ణ బోధామృతం

– శ్రీ రామకృష్ణ పరమహంస

సంసారంలో వుంటూ భగవంతుడి పాదపద్మాలపై భక్తిని కలిగి వుండి,సంసారం చేసేవాడు నిజంగానే ధన్యుడు సుమా ! నెత్తిమీద రెండు మణుగుల బరువు పెట్టుకొని కూడా దారిన వెళ్ళే పెళ్ళివారి ఊరేగింపును చూసే వ్యక్తిలాంటివాడు అతడు. ఎంతో శక్తివుంటే తప్ప అతడు అలా జీవించలేడు. అలాంటి సంసారి బురద చేపలాంటివాడు. అది బురదలో వుంటుంది, కాని దాని శరీరానికి కాస్తైనా బురద అంటుకోదు. నీటి పక్షి ఎల్లప్పుడూ నీటిలో మునిగి వుంటుంది. కాని అది ఒక్కసారి రెక్కలు విదిలించగానే దాని ఒంటిపై నీరేదీ నిలువదు.

సంసారంలో నిర్లిప్తభావంతో ఉండడానికిగాను కొన్ని సాధనలను చేయవలసి వుంటుంది. కొంతకాలంపాటు ఏకాంతంలో ఉండడం అవసరం. అది ఏడాదిపాటు కావచ్చు, ఆరు నెలలు కావచ్చు, మూడు నెలలు కావచ్చు, లేకుంటే ఒక నెలైనా కావచ్చు. ఆ ఏకాంత వాసంలో భగవచ్చింతన చేయాలి. వ్యాకుల చిత్తంతో భగవంతుణ్ణి భక్తికోసం ప్రార్థించాలి. హృదయాంతరాళాలలో ఇలా అనుకోవాలి– "ఈ సంసారంలో నా వారంటూ ఎవరూ లేరు. ఎవరినైతే నావారు అంటున్నానో వారు వుండేది రెండు రోజులు మాత్రమే. భగవంతుడొక్కడే నావాడు. ఆయనే నా సర్వస్వం. నే నాయనను ఎలా పొందగలను?"

భక్తిని సంపాదించుకొనిన తరువాత సంసారం చేయవచ్చు. ఇది చేతులకు నూనె రాసుకొని, పనస తొనలను వొలవడంలాంటిది. అప్పుడు చేతులకు జిగురు అంటదు. సంసారం నీటివంటిది. మనస్సు పాలవంటిది. నీటిలో పాలను పోస్తే రెండూ కలసిపోతాయి. అందుకే పాలను ఏకాంత ప్రదేశంలో (ఎవరూ పాలను కదపకుండేటట్టు) పెట్టి తోడుపెట్టవలసి వుంటుంది. పెరుగు తోడుకొనిన తర్వాత వెన్నను తీయవలసి వుంటుంది. వెన్నను తీశాక దానిని నీటిలో వేసినట్లైతే అది నీటిలో కలసిపోదు. నిర్లిప్తంగా నీటి మీద తేలుతూ వుంటుంది.

నిర్లిప్తభావంతో సంసారం చేయడం ఎంతో కష్టం. సాధనలు చేయాలి. ఏకాంతంలో భక్తిని, జ్ఞానాన్ని పొందిన తరువాత వెళ్ళి సంసారం చెయ్యాలి.

# సాధన పంచకము

– శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

( గత సంచిక తరువాయి )

శృతిశిరోవాక్యం సమాకర్ణ్యతామ్

ఉపనిషద్వాక్యము బాగాగ వినబడుగాక! అర్థాత్ వినదగినది

శ్రూయతే ఇతి శృతి = ఋషుల ద్వారా వినబడునది. కావున శృతి అనబడును. శృతి అనగా వేదము, వేదమునకు శృతి, అనుశ్రవః, ఆమ్నాయః అను మొదలగు పేర్లున్నవి.

సూక్ష్మంగా పరిశీలించే కొలది వేదం అపౌరుషేయం, సనాతనం, స్వతః ప్రమాణం, క్రాంతదర్శి, అనాది నిధనం, స్వయంజాతం, బ్రహ్మాతత్వావబోధకం,పురుషార్థ సాధనం, గురుశిష్య పరంపరాప్రాప్తం అని స్పష్టబడుతుంది. ఇట్టి శృతికి గల నామాలలో వేదమనేది అత్యంత ప్రసిద్ధమ్.

శృతి శిరోవాక్యమనగా – ఉపనిషత్తులు చెప్పిన వాక్యములు. శృతి శిరములనగా – వేదములయొక్క శిరస్సులు ఉపనిషత్తులు అని భావము. వేదము కర్మకాండ, జ్ఞానకండ అని రెండు విధములుగా నుండును. చివరి భాగం జ్ఞాన విషయముగావున, ఉపనిషత్తులు వేదముల కాధారమైన జగత్తుకు ఆధారమైన పరమాత్మను గూర్చి చెపుచున్నవి. కావున,మానవజన్మను తరింపచేయుచున్నవి. గావున, తత్వమసీతి మహావాక్యములను బోధించి జీవబ్రహ్మలకు ఏకత్వమును ప్రతిపాదించుచూ, "సర్వం ఖల్విద బ్రహ్మ,ఏకమేవాద్వితీయం బ్రహ్మ' అని సమస్తమూ పరబ్రహ్మ స్వరూపమే అని "ఈశావాస్యమిదగ్ం సర్వం యత్కించిజ్జగత్యాంజగత్" ఈ ప్రపంచములో ఏ అణువు ఉన్నదో అది పరబ్రహ్మ స్వరూపమేయని,ప్రపంచమంతా వ్యాపించిన



Scanned with CamS

చైతన్య శక్తియే పరబ్రహ్మమని, దీనిని తెలిసికొనుటయే మానవ జన్మ ముఖ్య కర్తవ్యమని, ఇదే పరమ పురుషార్థమని, ఇదే మోక్షమని ఇటువంటి జ్ఞానాన్ని ఉపనిషత్తులు చెప్పుచున్నందున వీటిని శృతి శిరోవాక్యములందురు. అవి బాగుగా శ్రవణము చేయదగినవి అని సాధకులకు ఈ సాధన చాల ముఖ్యమని ఈ రెండవ శ్లోకములో పదునారవ సాధన చెపుచున్నది.

## సాధన పంచకము 3వ శ్లోకము

వాక్యార్థశ్చ విచార్యతాం శృతిశిరః పక్షస్సమాశ్రీయతామ్ ।

దుస్తర్కాత్సువిరమ్యతాం శృతిమతస్తర్కోనుసంధీయతామ్ ।

బ్రహ్మైవాస్మి విభావ్యతాం అహరహర్గర్వః పరిత్యజ్యతామ్ ।

దేహే ఒహంమతిరుజ్ఝతాం బుధజనై ర్వాదః పరిత్యజ్యతామ్ ॥

తత్త్వమసీతి మహా వాక్యార్థము విచారణ చేయబడుగాక, అర్థాత్ విచారణ చేయదగినది. ఈశావాస్యాది ఉపనిషత్తుల అభిప్రాయమును బాగుగా నాశ్రయింపదగినది. న్యాయ విరుద్ధ తర్కము విరమింపదగినది. వేద సమ్మతమైన వాదమునననుసరించవలెను. 'అహంబ్రహ్మాస్మి' నేను బ్రహ్మమును, సర్వ వ్యాపకమైన బ్రహ్మము నేనే అయి వున్నాను అని బాగుగా మననము చేస్తూ భావించవలెను. ప్రతిదినము అనగా ఎల్లపుడు దేహతాదాత్మ్యబుద్ధితో కూడిన నేను, నేను అనే అహంకారమును విడువవలెను. మాంసాదిమయమగు, పరిణామశీలమయినదగు నీ దేహమే నేను అనే బుద్ధిని విడువవలెను. ఆత్మ అనాత్మల, ధర్మాధర్మములను తెలిసిన బుధజనులతో వివాదమును విడువవలెను. అధర్మ సంబంధ అనాత్మ సంబంధమైన భావములను, మనస్సులో పెట్టుకొని తన లక్ష్యమును సాధించవలెనని పట్టుదల గలిగినవారు బుధజనులతో వాదము పెట్టుకోకూడదు అని భావము. ఈ శ్లోకము యొక్క తాత్పర్యము బాగుగా



తెలిసికోదగినది.

### వాక్యార్థశ్చ విచార్యతామ్

తత్త్వమస్యాది మహా వాక్యములు విచారింపదగినవి. "వ్యాకరణరీత్యా వాక్యంతు పదసమూహః" అందురు. పదములయొక్క సమూహమును వాక్యమందురు. వక్తుం యోగ్యం వాక్యం, వచ పరిభాషణే – పలుక దగినది. 'తిఙ్ సుభన్తచ యస్య ఏక వాక్యతయా అర్థ వాచకత్వాద్వాక్యం'– తిఙ్సుబన్తసమూహమునకు ఏకార్థత్వము గలుగటవలన నిది వాక్యమన బడును. తిఙంతములు అనగా ధాతువులు –క్రియలు–పచతి, గచ్ఛతి, ఖాదతి, మోదతే– ఈ మొదలగునవి. సుబంతములనగా రామః, హరిః, విష్ణుః, పలం ఈ మొదలగునవి. రామః గచ్ఛతి=రాముడు వెళ్లుచున్నాడు. వీటిని వాక్యములందురు ఈ విధముగానే "దేవదత్త గామానయ శుక్లాందండేన" ఓ దేవదత్తుడా తెలుపు వర్ణముగల ఆవును కర్రతో తోలుకొని తీసుకొని రమ్ము అని ఈ వాక్యార్థము. ఈ వాక్యములో, సుబంతములు తిఙంతమైన ఆనయక్రియ ఉన్నది. దీనినే వ్యాకరణ రీత్యా మహావాక్యమందురు. వాక్యార్థశ్చ విచార్యతామన్నపుడు ఈ వాక్యార్థ విచారణగాదు. వేదాంత శాస్త్రమునందు వాక్యమను రూఢ్యర్థమునందు జీవబ్రహ్మల ఏకత్వమును బోధించునవి యగు మహావాక్యములను గ్రహించవలెను. **(సశేషం)**

**వేదాన్తభేరికి ఈక్రింది వారు పోషక చందా పంపినారు**

(1). ఎం.సాయన్న (మామిడిపల్లె) –జీవితచందా పైకంపోను–రూ.1500/-

(2). కె.చిన్న తిరుపాలు (పోలూరు) " " రూ.1500/-

(3). ఎస్.నాగేశ్వరరావు (జూబ్లీ గార్డెన్స్ –హైద్రాబాద్) – రూ.2000/-

(4). వేలంకి రుక్మాంగదుడు (బిక్కవోలు) – రూ.2000/-



Scanned with CamS

## సకల జనవంద్య ! గురుదేవ శరణు ! శరణు !

- డా ॥ నముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

1. మలయాళ యతీంద్రుదుని
స్తులధీసముపేతు డాశ్రితుల పాలిటికై
యిలకు దిగిన కల్పతరువు
నిలుచుత నా హృదయమందు నిశ్చలవృత్తిన్ ।

2. తెలుగు పొలమ్ముపవనమై
వెలయగ ననవిద్యవేద విద్యాబీజ
మ్ములు సల్లినట్టి సద్గురు
మలయాళస్వామి నెపుడు మదిలో దలతున్ ॥

3. శ్రీమన్నారాయణుడే
స్వామిగ తానవతరించె సర్వజగతికిన్ ।
క్షేమము గూర్పగ కావున
స్వామిపదాంబుజము లంటి సౌఖ్యము గనుడీ !

4. అరిషడ్వర్గవిదూరుడు
కరుణాభరణుండు సకల కల్యాణ గుణా
కరుడు యతిశ్రేష్ఠుడునౌ
చరాచరసుఖాభిలాషి సద్గురు గొలుతున్ ॥

5. గురులకు గురుం డసంగుడు
పరాత్పరనివిష్టమతి యభంగురయోగ
స్ఫురితాత్ముడు భక్తావళి
సురిచిర కృపతోడ నెపుడు జూడుంగాతన్

6. గురుభక్తియు నమ్రతయును
క్రమగతితో వృద్ధినొందగా నీ పాదా
బ్జముల మది నెన్నువాడను
సముచితగతి నన్ను గావ స్వామీ ! రావే !

7. స్వామి వినా నాకెవరీ
భూమిన్ రక్షకులు పరమ పూజ్యుండగు నీ,
స్వామియె నా సర్వస్వము
స్వామీ ! నీ కృపకు బాత్రు సల్పవె నన్నున్ ॥

8. చిత్తశాంతి యొకటె శ్రీకరమైనది
తక్కినట్టి సిరులు పెక్కులుండి
లాభమేమి? స్వామి! లాలితశిష్య ప్ర
శాంతమైన స్థితి నొసంగుమయ్య !

9. శరణము సద్గురుదేవుడు
శరణము సర్వసమభావసంపన్నుడిలన్
శరణ మసంగమునీంద్రుడు
చరాచర సుఖాభిలాషి శరణము- మనకున్.

10. సకల జనవంద్య ! గురుదేవ ! శరణు శరణు
సంశ్రితావన ! గురుమూర్తి ! శరణు శరణు,
సర్వసమభావ సంపన్న ! శరణు శరణు,
స్వామి ! వ్యాసాశ్రమనివాస శరణు, శరణు

11. మంగళము సద్గురూత్తమ ! మంగళమ్ము
మంగళము భక్త రక్షకా! మంగళమ్ము
మంగళము సత్యసంకల్ప ! మంగళమ్ము
మంగళము నీకు మలయాళ మౌనిచంద్ర !





Scanned with CamS

# సంసారం మహాసాగరం

- శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు

జీవిత వ్యవహారాలలో అలిసిపోయినప్పుడల్లా సంసారం మహా సాగరం అని సామాన్యులందరూ అంటూ వుండటము తెలిసిన విషయమే. సంసారం అంటే ఏమిటి? సంసార మంటే బాగా సాగిపోతూ వుండేది. సరతి అంటే సాగిపోయేది అని. ఈ సాగిపోయేది ఎవరు? జవాబు.. జీవియే – అంటే మనసే. ఆ మనసు సుఖమంటే ఏమిటో తెలుసుకోకుండానే సుఖంగా వుందామని నిర్విరామంగా సాగిపోతున్న కాలంతోపాటు నిరంతర ప్రయత్నాన్ని చేస్తూ వుంటుంది. ప్రయత్నమంటే తనకు ఇష్టమైన విషయాలను సంపాదించుకోవడము కష్టమైన విషయాలను వదిలించుకోవడము. మనసుయొక్క ఈ లక్ష్యము ఎన్నటికీ నెరవేరేది కాదు. ఎందువలన అంటే దానికి స్థిరత్వము లేకపోవటము వలన ఇష్టమైనవే మరొక సమయంలో కష్టము గాను కష్టమైనవే ఇష్టము గాను, మారుతుంటాయి. అంతేగాక దానికి వున్న వస్తువులతో తృప్తి వుండదు. కొత్త కొత్త విషయాలు కావాలి. ఇది దాని స్వభావము. ఈ స్వభావాన్ని మార్చుకోనంత వరకు మనసు తన లక్ష్యసాధన అంటే సుఖంగా వుండాలి అని విఫల యత్నాలతో అనేక విధాలైన ఉపాధులు అంటే శరీరాలను పొందుతూ విడిచిపెడుతూ సాగుతూ వుంటుంది.

ఏ రకమైన ఉపాధులను పొందుతుంది అనే ప్రశ్నకు ఎనభై నాలుగు లక్షల రకాలు అని శాస్త్రాలు, జ్ఞానులు తెలిపిన సమాధానము. ఇన్ని రకాల శరీరాలను ఒక్కొక్కసారే గాక అనేకసార్లు కూడా మనసు



పొందుతుంది. ఆ బ్రహ్మస్థావరాన్తమైనవి అంటే బ్రహ్మదేవుడు మొదలు కొని గడ్డిపరక వరకు గల జన్మలను అనేకసార్లు పొందుతూ, పెద్ద తుఫాను ప్రభావానికి అల్లకల్లోలంగా వున్న సముద్రతరంగాలలో ఒక ఎండు సొరకాయ బుర్ర కొట్టు కుంటునట్టు ఉచ్చనీచ జన్మల యందు జీవి తిరుగుతుందని పెద్దల బోధ.

ఎంతకాలము నుండి ఈ విధంగా జరుగుతున్నది అన్న విషయాని కొస్తే.. బ్రహ్మదేవుడి దినములో పగటి పూట సమయానికి కల్పము అని పేరు. ఇది ఒక వెయ్యి మహాయుగాల కాలము. ఒక మహాయుగము అంటే నలభై మూడు లక్షల ఇరువది వేల (43,20,000) మానవ సంవత్సరాలు. అంతే పరిమాణము బ్రహ్మదేవుడి రాత్రి సమయము. ఈ లెక్కన వారాలు మాసాలు సంవత్సరాల కాలం గడుస్తూ వంద సంవత్సరాలు నిండాక బ్రహ్మదేవుడి శరీరము నశించి పోతుంది. ఆయన ఆయుర్దాయము మూడుకోట్ల పదకొండు లక్షల నాలుగువేల కోట్ల మానవ సంవత్సరాలు. బ్రహ్మకాలమంతా పగటిపూట జీవుల పుట్టుకలు మరణాలు, వ్యవహారాలు జరిగి రాత్రి సమయంలో ఆగిపోతుంటాయి. ఒక బ్రహ్మదేవుడు అంతమై పోయాక మరొక బ్రహ్మ పదవిలోనికి వస్తుంటాడు. ఆ విధంగా ఇంతవరకు లక్షలమంది బ్రహ్మలు గతించి పోయారని జ్ఞానుల వాక్యము. ఐతే జీవులన్నీ విరామ మన్నది లేకుండా ఇంతకాలమూ వాటి సుఖప్రాప్తి లక్ష్యానికి అగచాట్లు పడుతూనే వుంటున్నాయి అన్నది గమనించ వలసిన విషయము.

ప్రపంచంలో సుఖము లేదా అన్న సంగతిని బాగా పరిశీలిస్తే లేదనే అవగత మౌతుంది. సమస్యలను పరిష్కరించుకుని వ్యవహారాలను ముగించుకుని రేపు సుఖంగా వుండవచ్చు అనే అపోహలో శ్రమనే మిగులుతున్నది. గానీ రేపు అనేది రావడము లేదు. తత్త్వశాస్త్రాలు తెలిపేది



Scanned with CamS

కూడా ఇదే. ఉదాహరణకు పురాణ కథ ఐన హిరణ్యకశిపుడి జీవితాన్ని విచారిద్దాము. తన తమ్ముడిని శ్రీహరి వధించాడని తెలిసి బాధతో ఆయనను వధించి తనవారందరితో శాశ్వతంగా ఆనందంగా వుందామనుకున్నాడు. హిరణ్యకశిపుడు, అంటే తనకు సుఖాలకు లోటు లేక బోయినా గూడా తమ్ముడు చనిపోయాడనే దుఃఖము అతడి సుఖాన్ని మింగేసింది. తనకు మరణము లేకుండా వుండాలనీ శ్రీహరిని వధించాలనీ మహారాజ భోగాలన్నింటినీ వదిలేసి వంద సంవత్సరాలు అతి కఠోరమైన తపస్సును (కేవలము అస్థిపంజరము మాత్రము వుండగా) చేశాడు. అంటే అంత సమయము కూడా కష్టాన్నే అనుభవించాడు. అతడి తపస్సు ఫలించి, బ్రహ్మదేవుడి సృష్టిలో గల దేనిచేతా మరణము లేకుండానూ, ఆరోగ్యము బలము ఎప్పటికీ తగ్గకుండానూ, ఎవరి చేతా పరాజితుడు కాకుండానూ సుదుర్లభమైన వరాలను పొందాడు. తరువాత వరాల ప్రభావం చేత యుద్ధమనేది లేకుండానే త్రిలోకాలను తనవశం చేసుకున్నాడు. అంటే త్రిలోకభాగాలన్నిటినీ స్వేచ్ఛగా అనుభవించే అవకాశాన్ని పొందాడు. ఐతే వాటి వలన ఎంత సుఖాన్ని అనుభవించాడు అని పరిశీలిస్తే అంతంత మాత్రమే అని తెలుస్తుంది. ఎందువలన శ్రీహరిని ఎప్పుడు హతమారుస్తానా అనే ఆలోచన మనసును నిరంతరము వేధిస్తున్నది. ఆ తరువాత ఐదు ఏళ్ళ తన కొడుకు, ప్రహ్లాదుడిని విద్యాభ్యాసానికి గురువుల వద్దకు పంపి, వాడు అనవరతమూ తన శత్రువు చింతనతో ఆయన వశమైపోయాడనే వేదన అగ్నిలో ఆజ్యము పోసినట్టు హిరణ్యకశిపుడి అశాంతిని అపరిమితం చేసింది. నిజానికి అతడి సుఖాలకు ఏలోటూ, ప్రతి బంధకములూ లేక బోయినా మనసులో గల శ్రీహరి మీది తీవ్ర ద్వేష ప్రతీకారాలు క్షణం గూడా సుఖంలేకుండా చేశాయి. కొడుకు తన మాటను వినడం లేదనే అభిమానము కూడా అతడి సుఖాన్ని అంతం చేసింది. ఆపైన వందేళ్ళ



తపః ఫలాన్ని అనుభవించకుండానే, ఐదేళ్ళలో తన ఇంటి వాకిట్లోనే దుర్మరణం పాలైనాడు.

ఇదంతా ఎందుకు చెప్పానంటే త్రిలోక భోగాలు చేతిలో గలవాడికే సుఖం లేకబోతే ఇక సామాన్య మానవులను గురించీ అంతకన్నా అధమ జన్మలను గురించీ ఏమని చెప్పాలి?

ఇక స్వర్గాధిపతి ఐన ఇంద్రుడి విషయాని కొస్తే అతడికీ, భోగాలు చెయ్యిజారిపోతాయేమోననే భయము, దైత్యదానవుల వలన పరాజితుడై వనాలలో నివాసమూ, ఎవరు తపస్సుకు చేసినా తన పదవి కోసమే అనే అపోహతో వారికి విఘ్నాలను కలిగించడము చేశాడు. ఏ మాత్రమూ వివేకము లేకుండా భగవదవతారమైన నరనారాయణుల తపస్సుకు కూడా భంగం కలిగించాలని విఫల ప్రయత్నం చేశాడు. ప్రమత్తత పరస్త్రీ వ్యామోహము ఇత్యాది అవగుణాలతో ఇంద్రుడు కూడా సుఖంగా లేడని తేలుతున్నది.

సారాంశము ఏమిటంటే తనలోని అవగుణాల కారణంగా యథార్థ సుఖాన్ని అంటే ఆత్మ స్వరూప సుఖాన్ని గ్రహించలేక జీవే, ఎండమావుల నీటి కోసము పరిగెత్తినట్టు, ప్రాపంచిక సుఖాభాసకు మోహితుడై జన్మ పరంపరలో తిరుగుతున్నాడు. జీవియొక్క ఈ తిరగటమే సంసారము.

జీవియొక్క సంసారంలో అతడి వివేకాన్ని హరించే దురాశ, కామ, క్రోధ, భయ, లోభమోహ దంభదర్పాది అనేక దుర్గుణాలు, ధర్మాలు, బాధ్యతలు, ఆకర్షణలు, మోసాలు, ఘోరవ్యాధులు, పరుల వేధింపులు, ఋణాలు, నేరాలు, ఘోరాలు ఈతిబాధలు, ఎదురు దెబ్బలు, ఇష్టము లేని పనులైనా గత్యంతరములేక చెయ్యడము, ఆధ్యాత్మికాది త్రివిధ తాపాలు ఇటువంటి మొసళ్ళు తిమింగలాల వంటివి కలవు. పెద్దవీ చిన్నవీ ఐన

ఓడలు పడవలు సముద్రాన్ని ఉపయోగించుకుని వ్యాపార ప్రయోజనాలను పొందినట్టు అనేకమంది ఇతరులు తనశక్తి సామర్థ్యాలను ఉపయోగించు కుంటూ లాభాలను గడించుకోవడము, ధ్రువస్థానాల వద్ద అతి శీతల వాతావరణానికి సముద్రము గడ్డ కట్టుకుని పోయినట్టు ఒకప్పుడు సమస్యలకు ఏమీ చెయ్యలేక చతికిల పడిపోవటమూ, సాగరంలో బడబాగ్నికి మాదిరి తన కుటుంబంలోనే విషమ పరిస్థితులు తలెత్తి మనసును కుతకుత లాడించడమూ, సాగర సంపద ఐన ముత్యాలు, రత్నాలు, చేపలు మొదలైన ఆహార పదార్థాలను జనులు పట్టుకుపోయినట్టు – ప్రభుత్వము, చోరులు, దుర్జనులు, ప్రకృతి తన సంపదను కాజెయ్యడము, నిరంతరం పుట్టి నశిస్తున్న అలల మాదిరి కలిగే జనన మరణాలు, ఇన్నీ కలిగి వున్నది. కాబట్టి ఈ సంసారం మహాసాగరము అని చెప్పబడింది. "ఇహ సంసారే బహుదుస్తారే కృపయా పారే పాహి మురారే" అని శ్రీ శంకర భగవత్పాదులు ఈ విషయాన్నే సూచించారు.

ఒక గూఢమైన రహస్యము ఏమిటంటే ఇంత భయంకర సంసారమంతా అవిద్యాయుక్త మనసు చేతనే కల్పించబడింది, అంటే ఇది ఒక స్వప్నము వంటిది మాత్రమే అని అర్థము. భగవదనుగ్రహాన్నీ సద్గురువు అనుగ్రహాన్నీ సంపాదించిన వ్యక్తికి ఇది సంసారము గాక పరమాత్మ స్వరూపము మాత్రమే అని బోధ పడుతుంది. ఈ సత్యాన్నే "మత్తః పరతరం నాన్యత్ కించి దస్తి ధనంజయ" అని శ్రీమద్భగవద్గీత ఏడవ అధ్యాయములో భగవానుడు స్పష్టం చేశాడు.

కాబట్టి భగవదనుగ్రహానికి సాధన చేసి సంసార భ్రాంతిని పోగొట్టి శాశ్వతమైన ఆనంద స్థితిలో వుండటమే వివేకవంతమైన కార్యము.

**ఓం తత్ సత్**



# శ్రీ సద్గురువు మలయాళ స్వాములవారి సంఘసేవ

**– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు**

ఆ రోజులలో సంఘమునందు, మానవ సమాజమునందు ఎట్టి వాతావరణమున్నదో ఒకింత తెలిసికొనవలసి యున్నది. 'స్త్రీలు గాని, శూద్రులుగాని, భగవద్గీతాది గ్రంథములను చదువగూడదు. తాకగూడదు. సంస్కృతమును, వేదవాఙ్మయమును పఠించుటకు వారికి అధికారము లేదు' – అనునిట్టి దురభిప్రాయములు, దుర్వాదములు, కరుడు గట్టిన సాంఘిక దురాచారములు, అసమాన భావములు జనులలో రూఢిపడియున్న రోజులవి. అత్తఱి దక్షిణ దేశమున శ్రీనారాయణ గురు దేవులవతరించి అందఱికిని 'ఒకేజాతి, ఒకే మతము, ఒకే దేవుడు'అని బోధించి జనుల హృదయములను బాగుగ సంస్కరించిరి. వారి ప్రశిష్యులే శ్రీసద్గురు మలయాళస్వాములవారు. వీరున్ను వారి గురుదేవుల పగిది జనులలో వ్యాపించియున్న సంకుచితత్త్వమును పారద్రోలి, తమ అనుభవ వాక్యములచే సంఘములో గొప్ప ఆధ్యాత్మిక విప్లవమును కలుగజేసిరి. వారి దివ్యబోధలచే ఎందఱో తమ జీవితములను సంస్కరించుకొనిరి. శ్రీస్వాములవారు తమ పవిత్ర ఆచరణ ద్వారా, తమ దివ్యప్రబోధముల ద్వారా, ఆంధ్రదేశమున అపూర్వమగు ఆధ్యాత్మిక సంచలనమును గావించిరి. పరమార్థరంగమున, సాంఘిక రంగమునగొప్ప ప్రగతిని సాధించిరి.

అన్ని మతములయొక్క లక్ష్యము ఒకటేయని బోధించి శ్రీస్వాముల వారు మత సామరస్యమును ప్రోత్సహించిరి. దైవమతము, కరుణామతము, శాంతిమతము, సత్యమతము, స్వాతంత్ర్య మతము, ఋషిమతము,



Scanned with CamS

జ్ఞానమతము మున్నగునవి వర్ధిల్లవలెనని శ్రీవారు తఱచు చెప్పుచుందురు. సంఘ వ్యతిరేక శక్తులను ధైర్యముతో నెదుర్కొని శ్రీవారు విజయమును సాధించిరి. మిథ్యాచారుల కపటములను, మోసములను వేషములను, మాలిన్యములను, వ్యసనములను, మూఢాచారములను శ్రీవారు ఖండించివైచి సమాజములో పవిత్రతను నెలకొల్పుటకై తీవ్రతర కృషి సలిపిరి. వాని నెదుర్కొనుటకు ఆవిర్భవించిన గ్రంథమే శ్రీవారి ప్రప్రథమ రచనయగు 'శుష్క వేదాంత తమోభాస్కరము'.

శ్రీస్వాములవారి ధర్మప్రబోధములచే జనులు జాగ్రత్తులై తాము ఋషి సంతతివారని తెలిసికొన గలిగిరి. వారి పాదస్పర్శచే ఆంధ్రదేశమే కాక భారతావని యావత్తు పునీతమైనదని చెప్పవచ్చును. స్వారాజ్యము యొక్క అనగా ఆత్మ సామ్రాజ్యము యొక్క ప్రాముఖ్యతను జనులకు తెలియజేయుట, కులమతాది భేదములతో దిగజారిపోయిన మానవాళికి సర్వసమభావమును ప్రబోధించుట, జాతి మత కుల లింగవయో విచక్షణ లేక జిజ్ఞాసువులైన ప్రతివారికి దైవ తత్త్వమును తెలియజేయుట, ఆధ్యాత్మ వాఙ్మయమున నిక్షిప్తములై యున్న జ్ఞానరత్నములను బయటకు తీసి సర్వ జనులకు అందించుట, సంసార తాపపరితప్తులగువారు ధ్యానాదులు సలుపుకొని ప్రశాంతిని బడయుటకై ఆశ్రమములను స్థాపించుట మున్నగునవి శ్రీ స్వాములవారి ముఖ్య ఆశయములై యున్నవి. బుద్ధి కుశలతచే వాటి నన్నింటినిశ్రీవారు తమ జీవిత కాలమందే చక్కగ సాధించివైచిరి.

సాంఘిక ఆధ్యాత్మిక రంగములందు శ్రీవారి ప్రబోధ ప్రచారములచే ఎన్నియో విప్లవాత్మకములైన పరిణామములు సంభవించినవి. జనులలో సంకుచితములైన భావములు తొలగి విశాల భావములు ఏర్పడినవి. సాంఘిక



ఆధ్యాత్మిక రంగములందు వెనుకబడియున్న స్త్రీలు, ద్విజేతరులు ఆయా రంగములలో లెస్సగ పురోగమించిరి. శ్రీవారి ప్రబోధములచే జనులలో ప్రగతిశీలమైన దృక్పథము ఏర్పడినది. భౌతికాభివృద్ధితో తృప్తిపడక ఆత్మోన్నతికి కూడ కృషి సలుపవలెననియు, విశ్వ శ్రేయస్సునకై శక్తి కొలది పాటుపడవలెననియు శ్రీవారి ప్రబోధములచే జనులు తెలిసికొన దొడగిరి.

శ్రీ వ్యాసాశ్రమ స్థాపకులగు శ్రీమలయాళస్వాములవారు దైవాంశ సంభూతులు. ప్రజల అజ్ఞాన మేఘములను విచ్ఛిన్న మొనర్చి జ్ఞానాలోకమును కలుగజేయుటకై అవతరించిన మహనీయులు. చెప్పినది చేయుట, చేసినది చెప్పుట వారి యందలి ఒక గొప్ప విశేషములు. శ్రీవారి జీవితము ఒక విస్తృత ఆధ్యాత్మిక ప్రయోగశాల (Spiritual Laboratory)అని చెప్ప వచ్చును. వారు సాధన చేయునపుడు ఎన్నియో కష్టములను ఎదుర్కొనిరి. రోజులతరబడి ఏమియు భుజించని సందర్భములు కూడ వారి జీవితమున కలవు. అయినను భగవంతునిపై పరిపూర్ణ విశ్వాసముంచి తపస్సును కొనసాగించి ఎట్టకేలకు విజయమును సాధించిరి. పవిత్రత, సహనము, పట్టుదల అను మూడు ఉదాత్తగుణములు శ్రీవారియందు ప్రస్ఫుటముగ కానుపించును. తీవ్రతపంబుసలుపుట, తపస్సిద్ధ్యనంతరము ఆశ్రమమును స్థాపించుట, క్రమశిక్షణాదులను గఱపుట, ఆధ్యాత్మిక పత్రికను స్థాపించుట, సభలను నిర్వహించి బ్రహ్మవిద్యా ప్రచారమును చేయుట, గ్రంథరచన గావించుట, సంస్కృత పాఠశాలలను స్థాపించుట మొదలగు ఇన్ని మహత్తర కార్యలములనొనర్చినను శ్రీవారు అసంగులై వానితో తగుల్కొనక, నిర్లిప్తులై యుందురు. ఇదియే శ్రీస్వాములవారి యందలి గొప్ప విశిష్టత. 'అసంగానందస్వామి'అను తమ పవిత్రనామ ధేయమును శ్రీవారు సార్థక పఱచిరి.



Scanned with CamS

నియమ నిష్ఠలను పాలించుటలోను, ఇతరులచే పాలింప జేయుట లోను శ్రీస్వాములవారు అందెవేసిన చేయి. **జీవిత మంతయు నియమ బద్ధముగా గడుపవలెనను దృఢసంకల్పము కలుగు దశనుండియే మానవత్వము ప్రారంభించునని** శ్రీవారు తఱచు సెలవిచ్చుచుందురు. ఆధ్యాత్మిక నియమనిబంధనలకు, క్రమశిక్షణకు శ్రీవారెంతయో ప్రాధాన్యత నొసంగుచుందురు. శ్రీవారి క్రమశిక్షణా విధానము వజ్రతుల్యముగ నున్నను, దాని వెనుక నవనీతహృదయము దాగి యుండును. శ్రీవారిలోని గొప్ప విశేషములలో ఇది యొకటి. బ్రహ్మ విద్యాపారంగతులు, అపరశంకరులు, ఆధునికవ్యాసులు, అవిద్యాతమో భాస్కరులు అగు శ్రీస్వాములవారు తాము తరించి ఇతరులను తరింపజేయుటలో అహరహము కృషి చేసిరి.

శ్రీవారు గోగర్భమునందు తపస్సు చేయు కాలములో జనులయందు సాంఘిక దురాచారములు, వర్గ వైషమ్యములు తాండవించు చుండెను. దురాచారములు అంటుజాడ్యమువలె వ్యాపించు చుండెను. కులమత ద్వేషములు మానవజాతి మనుగడకే అడుగడుగున ఆటంకములు కల్పించు చుండెను. విశాల భావములు కల శ్రీస్వాములవారు అదియంతయు గమనించి, వారి బోధలచే, రచనలచే, ఆచరణచే జనులలోని సంకుచిత భావములను పారద్రోలి, సమరస భావమును స్థాపింపజేసి వేదాంత రహస్యములు తెలిసికొనుటకును, అంతఃకరణ ప్రశాంతతను అనుభవించుటకు జాతి మత కులము లెవ్వియు అడ్డురావనియు, సర్వులును వాని ననుభవించవచ్చుననియు బాహాటముగ చాటివైచిరి. శ్రీవారి ఇట్టి విశాల దృక్పథము జనులలో ఎంతయో సత్ప్రభావమును కలుగజేసినది. జాతి మత కుల భేదములు లేక ఎందఱో



వేదాధ్యయనమును ప్రారంభించిరి. సంస్కృతము చదువ నారంభించిరి. బ్రహ్మ విచారణ, బ్రహ్మాభ్యాసము చేయ మొదలిడిరి. స్త్రీలు ఎందఱో భగవద్గీతాది సద్గ్రంథములను పఠించి జపధ్యానాది ఆధ్యాత్మిక సాధనలను చేయ నారంభించిరి. ఈ ప్రకారముగ శ్రీ స్వాములవారు సంఘమున విప్లవాత్మకమైన పరిణామములు కలుగజేసి ఒక గొప్ప క్రాంతిని తీసికొని వచ్చి జనులకు నూతన చైతన్యమును కలుగజేసిరి.

కార్యదక్షత, బ్రహ్మర్షిత్వము, కోమల హృదయము, తపోమహిమ, నిర్వికల్పధ్యానము, విద్యా వైదుష్యము, భక్తి జ్ఞానవైరాగ్యములు – అన్నియు శ్రీస్వాములవారి యందు నెలవు చేసికొనినవి.

శ్రీ స్వాములవారి జీవితము భగవద్గీతకు భాష్యమని చెప్ప వచ్చును.వారి తపోనిష్ఠ, తీవ్రవైరాగ్యము, కార్యదక్షత, విజ్ఞానము, దూర దర్శిత్వము, అసంగత్వము, నిర్వికారత్వము, విశాల హృదయము, పరోపకార కాంక్ష, జనులకు మార్గదర్శకములై యున్నవి. వెయ్యేల ఆధ్యాత్మికాకాశమున శ్రీస్వాములవారు ధ్రువతారయై విలసిల్లుచున్నారు.దీనత్వమును విడిచి ధీరులు కండని శ్రీవారు తఱచు ఉద్బోధించు చుందురు. ఆర్ష సంస్కృతిని ఉద్ధరించి ఋషులవలె ధీరోదాత్తులై మెలగుడనియు శ్రీవారి ఉద్బోధ. వారి మాట లోకాభ్యుదయమునకు బాటయై చెన్నొందినది. నిద్రాణమై యున్న ప్రజానీకమును మేలుకొలుపుటకు శ్రీవారు కంకణము కట్టుకొనిరి. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులు, ఆంధ్ర వేదాంత పితామహులు, సనాతన ధర్మోద్ధారకులు, అనుష్ఠాన తత్పరులు ఆగు శ్రీస్వాములవారు కేరళ దేశమున జన్మించి నప్పటికిని, ఆంధ్రావనియందే తపంబు సలిపి, ఆంధ్రులకు అన్ని రంగము లందును మహోపకృతి నొనర్చి భక్తుల పాలిట కల్పతరువై విరాజిల్లిరి.

లోకోద్ధరణకై అవతరించిన కారణ జన్ములువారు. ఆంధ్రదేశ



Scanned with CamS

బ్రహ్మవిద్యా చరిత్రలో శ్రీవారి దొక స్వర్ణాధ్యాయము, మానవ సమాజ వికాసమునకు శ్రీస్వాములవారు ఎనలేని కృషి సలిపి జనులు పవిత్ర జీవితమును, నిష్కళంకవర్తనము కలిగియుండుట కెంతయో దోహదమును కలుగజేసిరి. శ్రీస్వాములవారికి భగవంతునిపై పరిపూర్ణ విశ్వాసము కలదు. "అంతయు దైవసంకల్పము, ఆ సర్వేశ్వరుడేమి చేయించదలంచిన అది జరుగుచుండును. ఇందు మన కర్తృత్వమేమియు లేదు. పరమాత్మ ఏయే కార్యములను చేయించుటకు నన్ను పుట్టించెనో ఆయా కార్యము లన్నియు నాచే చేయించినారు. మేము మొదటి నుండియు భగవంతుని నమ్మి జీవించుచున్నాము. మాకేది అవసరమని తోచునో, దానిని ఆ కరుణామయుడే సమకూర్చును"- అని శ్రీవారు అపుడపుడు చెప్పుచుందురు.

ఈ ప్రకారముగ అకుంఠిత దైవభక్తి, క్రమశిక్షణ, శాస్త్రవిజ్ఞానము, ఆధ్యాత్మిక అనుభూతి గలిగియున్న శ్రీమహర్షి సద్గురు మలయాళ స్వాములవారి పవిత్ర జీవితము జనులకు ఆదర్శవంతమై, మార్గదర్శకమై యలరుచున్నది. ముముక్షువు లిద్దానిని శ్రద్ధగా పరిశీలించి శ్రీవారి దివ్య బోధలను కార్యాన్విత మొనర్చి పరమానందము ననుభవించుదురు గాక!

**1. బైట వస్తువులు పెరగడం కాదు, లోపలి వాసనలు తరగాలి. అప్పుడే శాన్తి.**

**2. నిప్పును సోకి జొన్నగింజ తెల్లనౌతుంది (పేలాయి). సాధుసాంగత్యంతో పాపికూడ పరిశుద్ధడవుతాడు.**

**3. పారే నదికి వొళ్ళంతా కాళ్ళు. మండే అగ్నికి వొళ్ళంతా నోళ్ళు. వీచే గాలికి వొళ్ళంతా చేతులే. మునికి లోకమంతా సొంతిలే.**

**- స్వామి రామకృష్ణానంద (గండిక్షేత్రం)**



# వేదాన్త సారము

**మూలం : స్వామి సదానంద యోగీంద్రుడు**

ఈ వేదాంతసారమను గ్రంథం వేదాన్తసాహిత్యములో ప్రసిద్ధ ప్రకరణ గ్రంథమై యున్నది. ఇది ఆంగ్లము మొదలైన అనేక భాషలలోనికి అనువదింపబడి బహుజనాదరణ పొందినది. దీనికి స్వామి నృసింహ సరస్వతి వారు రచించిన సుబోధిని, ఆపోదేవులు రచించిన బాలబోధిని, మధుసూదనసరస్వతికి గురువగు రామతీర్థులు రచించిన విద్వన్మనోరంజని అను వ్యాఖ్యానములు కూడ కలవు. ఈ వ్యాఖ్యానముల ద్వారా యీ గ్రంథమునకు బహుళ ప్రచారము కలుగుటయే కాక ఈ గ్రంథము బహుజనామోదమును కూడ పొందినది. దీనిని అద్వయానంద సరస్వతి శిష్యులగు సదానంద యోగీంద్ర సరస్వతివారు రచించిరి.

ఈ వేదాంతసారము గౌడపాద, శంకర,సురేశ్వరాచార్యులు మొదలగు వారి ప్రసిద్ధ వేదాంత గ్రంథములకు ఉపోద్ఘాతమువంటిదై యున్నది. వారి రచనలను గ్రంథకర్త తన గ్రంథమునందుదహరించి యున్నారు.

ఇందు తత్త్వాన్వేషికి కావలసిన అధికారి లక్షణాలను చెప్పి ఆఖరులో తత్త్వమసి యను మహావాక్య వివరణ చేసి యున్నారు. బ్రహ్మజ్ఞానము కలుగకుండ ఆటంక పరచునది అజ్ఞానమే కావున దానిని తొలగించుటకు ఆ అజ్ఞాన లక్షణమును తొలిసికొనవలసి యున్నది. కావున యీ అవిద్యయొక్క సమష్టి వ్యష్టి రూపములను, తత్కార్యమైన జగదుత్పత్తి విధమును, ఈ జడ ఉపాధులను ఆ పరమాత్మకు గల భేదమును ఇందు వివరించి యున్నారు. ఆ సందర్భములో చార్వాక భాట్ట బౌద్ధమతములను కూడ వివరించి ఖండించియున్నారు. తుట్టతుదకు తత్త్వమసి యను బోధనా



Scanned with CamS

వాక్యమును, అహం బ్రహ్మాస్మియను అనుభవ వాక్యమును విశ్లేషించి యుక్తి ప్రపత్తులతో వివరించి యున్నారు. అంతమున జీవన్ముక్తి లక్షణములను చెప్పినారు. దీనివలనస్వార్థరహిత సంయమ జీవనమే జీవన్ముక్తునకు సహజ లక్షణమని తెలియుచున్నది. అట్టివాడే భూమి మీద దేవుడు. ఇదియే వేదాంతసారము.

( ఈ వేదాన్తసారము ఇకపై ధారావాహికంగా ప్రచురించబడును. నాకు లభించిన ఈ తెలుగు అనువాద గ్రంథంలో అనువాదకుని పేరు లేదు. కాబట్టి అనువాదకుని పేరు మేము వేయలేదు. మాకు లభించిన ఈ తెలుగు అనువాద గ్రంథంలో కీ॥శే॥ శ్రీమతి తల్లం కమలమ్మ గారి స్మారక చిహ్నాము అని వుంది సం॥)

## వేదాంత సారము – ప్రథమాధ్యాయము

**అఖండం సచ్చిదానందమవాఙ్మానస గోచరం ।**
**ఆత్మానమఖిలాధారమాశ్రయే உభీష్టసిద్ధయే ॥ 1**

**తా॥** అఖండమై, సచ్చిదానంద స్వరూపమై, అవాఙ్మనస గోచరమై సమస్తమునకును ఆధారభూతమైన అ పరమాత్మను అభీష్ట సిద్ధికై ఆశ్రయించు చున్నాను.

“యతో వా ఇమాని భూతాని జాయన్తే” అను శ్రుతి ప్రకారము ఆత్మ అఖిలాధారమై యున్నది.

తాను వ్రాయు గ్రంథము నిర్దుష్టముగా శాస్త్రానుసారము కొనసాగుటయే యిచట గ్రంథకర్తయొక్క అభీష్టము. కావున నిర్విఘ్నముగా గ్రంథము పరిసమాప్తి పొందుటయే అభీష్ట సిద్ధియగును. లేదా సమస్త లోక కల్యాణము సిద్ధించుటే ఇచట అభీష్ట సిద్ధియని కూడ అనుకొన వచ్చును.



**అర్థతో உప్యద్వయానందా నతీతద్వైతభావతః ।**
**గురూనారాధ్య వేదాంతసారం వక్ష్యే యథామతి॥ 2**

**తా॥** ద్వైతభావమును అధిగమించి ప్రకాశించుటచేత సార్థక నామ ధేయుడైన అద్వయానంద గురువును ఆరాధించి బుద్ధికి తోచినంత వేదాంతముయొక్క సారమును వివరించుచున్నాను.

గ్రంథకర్తయగు సదానందుల ఆధ్యాత్మిక గురువుయొక్క నామము అద్వయానంద, పరమోత్కృష్టమైన ఆధ్యాత్మిక జ్ఞానము కలవాడగుటచేత గురువు సార్థకనామ ధేయుడగుచున్నాడు. మరియు అద్వయానంద అను పదము పరమాత్మను కూడ సూచించుచున్నది. కావున యిచట తన గురువును, ఆ పరమాత్మనుకూడ నమస్కరించి గ్రంథకర్త గ్రంథారంభమును చేయుచున్నాడు.

### వేదాంతపద అర్థ వివరణము

**వేదాంతో నామ ఉపనిషత్ప్రమాణం తదుపకారీణి శారీరకసూత్రాదీని॥ 3**

**తా॥** వేదాంతమనగా ఉపనిషత్ప్రమాణముగల విషయము. మరియు తదుపకారకమైన శారీరక సూత్రాదులు (బ్రహ్మసూత్రములు మొదలైనవి) కూడ వేదాంతమే యగుచున్నది.

వేదాంతముయొక్క వాక్యార్థము –వేదములయొక్క చివరిభాగము. లేదా ఆధ్యాత్మిక విషయమును బోధించు వేదభాగము.

**ప్రమాణములు ఆరు విధములు :**

1. ప్రత్యక్ష ప్రమాణము 2. అనుమాన ప్రమాణము



Scanned with CamS

3. ఉపమాన ప్రమాణము 4. శబ్ద ప్రమాణము

5. అర్థాపత్తి 6. అనుపలబ్ధి.

ఉపనిషత్తులు శబ్దప్రమాణము లగుచున్నవి.

శారీరక సూత్రములు, బాదరాయణునిచే రచింపబడినవి. ఉపనిషత్తులను వ్యాఖ్యానించు ఇతర శాస్త్రములన్నియు తదుపకారకములై యున్నవి.

**అస్య వేదాంత ప్రకరణత్వాత్ తదీయై రేవ**

**అనుబంధైః తద్వత్తాసిద్ధేః న తే పృథగాలోచనీయాః ॥ 4**

**తా॥** ఈ వేదాంతసారము ఒక ప్రకరణ గ్రంథము. ఇచట దానియొక్క అనుబంధముల ద్వారానే ఆ వేదాంత వివరణము సిద్ధించుచున్నది. కావున ఆ అనుబంధములు ప్రకరణముకంటె భిన్నములని తలపరాదు.

**తత్ర అను బంధోనామ అధికారి విషయ సంబంధ ప్రయోజనాని ॥ 5**

**తా॥** అనుబంధములు నాలుగు. అవి. 1. అధికారి, 2. విషయము, 3. సంబంధము, 4. ప్రయోజనము అనునవి.

ప్రతియొక్క శాస్త్ర గ్రంథమునకును మున్ముందుగా ఈ అనుబంధ చతుష్టయము వివరింపబడుచున్నది.

**అధికారీ తు విధివదధీత వేదవేదాంగత్వేనాపాతతో ఉధి గతాఖిలవేదార్థో ఉస్మిన్ జన్మని జన్మాంతరే వా కామ్యనిషిద్ధవర్జనపురస్సరం నిత్య నైమిత్తిక ప్రాయశ్చిత్తోపాసనానుష్ఠానేన నిర్గతనిఖిలకల్మషతయా నితాంత నిర్మలస్వాంతః సాధనచతుష్టయసంపన్నః ప్రమాతా ॥ 6**



**తా॥** వేద వేదాంగములను శాస్త్రోక్తవిధి ప్రకారం అధ్యయనము చేసి సామాన్యముగా సమస్త వేదార్థమును అవగాహన చేసికొనినవాడై, యీ జన్మయందు గాని, జన్మాంతరమందుగాని, కామ్య, నిషిద్ధ కర్మలను త్యజించుటయే కాక నిత్యనైమిత్తిక ప్రాయశ్చిత్త ఉపాసనాదులననుష్ఠించి అఖిల పాపములనుండి ముక్తుడై, తత్ఫలితముగా మిక్కిలి నిర్మలమైన స్వాంతముగల వాడై, సాధన చతుష్టయముతో కూడిన జిజ్ఞాసువే అధికారి యగుచున్నాడు.

**శాస్త్రోక్త విధులు - బ్రహ్మచర్యాదులు : వేదాంగములు ఆరు. అవి**

1. శిక్షా - స్వర ఉచ్చారణ శాస్త్రము

2. కల్పము - కర్మాచరణ విధానమును వివరించు సూత్రములు

3. వ్యాకరణము 4. నిరుక్తము కఠినశబ్దములవ్యుత్పత్తి వివరణము.

5. ఛందస్సు 6. జ్యోతిషము

విదురాదులు యీ జన్మయందు శాస్త్రాధ్యయనాది విధులను పాటింపకున్నను జ్ఞానులైరనిన అందులకు పూర్వజన్మ సంస్కారమే కారణము. కావున జన్మాంతరంనుండే వారు అధికారిత్వమును పొందియున్నారు.

**కామ్యాని - స్వర్గాది ఇష్టసాధనాని జ్యోతిష్టోమాదీని ॥ 7**

**తా ॥** స్వర్గాది పుణ్యలోకములను పొందుటకు సాధనములైనవి కామ్య కర్మలగును. అనగా "జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత" స్వర్గకాముడు జ్యోతిష్టోమమును చేయవలయును అని శ్రుతి చెప్పుచున్నది. కావున స్వర్గమును కోరువాడు జ్యోతిష్టోమమును చేయుచున్నాడు. ఈ యాగములు నిర్దిష్టమైన ఫలమునిచ్చునవి. కావున అట్టి నిర్దిష్టమైన ఫలమునుకోరి చేయుటచే ఇవి కామ్య కర్మలగుచున్నవి.



Scanned with CamS

# భాగవతం షష్ఠ స్కంధము

- శ్రీ మాతా వరావిద్యానందగిరి

(గత సంచిక తరువాయి)

అనంతరము దక్షప్రజాపతి బ్రహ్మదేవుని సాంత్వన వచనములతో ఊరడిల్లి తన భార్యయైన అసిక్ని యందు 60 మంది కుమార్తెలను కనెను. వారందరూ తను తండ్రియైన దక్షప్రజాపతిపై మిక్కిలి ప్రేమ కలిగియుండిరి. వారిలో

10 కన్యలను ధర్మునకు, 13 మంది కన్యలను కశప్యప ప్రజాపతికి,

27 మంది కన్యలనుచంద్రునకు, ఇద్దరు కన్యలను భూతునకు,

ఇద్దరు కన్యలను అంగీరస ప్రజాపతికి, ఇద్దరు కన్యలను కృశాశ్వునకు

నల్గురు కన్యలను తార్క్ష్యుడను పేరుగల కశ్యపునకు ఇచ్చి వివాహము చేసెను. వీరి వంశపరంపరయే ముల్లోకములందు వ్యాపించెను.

మొట్టమొదట ధర్ముడు వివాహమాడిన పదిమంది దక్షప్రజాపతి కుమార్తెల పేర్లను వారి కుమార్ల పేర్లను తెలిసికొందాము.

1. భాను - దేవ ఋషభుడు. ఈతనికి ఇంద్రసేనుడు జన్మించెను.

2. లంబ - విద్యోతుడు. ఈతనికి మేఘగణములు జన్మించెను.

3. కకుభ - సంకటుడు. కీటకుడు ఈ భూతలము నందలి దుర్గముల అభిమాన దేవతలు జన్మించిరి.

4. జామి - స్వర్గుడు - నంది 5.విశ్వ - విశ్వే దేవతలు

6. సాధ్య - సాధ్య గణములు - అర్థసిద్ధి.

7. మరుత్వతి - 1. మరుత్వంతుడు 2. జయంతుడు. వాసుదేవుని అంశము అయినందున ఈతనిని ఉపేంద్రుడు అనికూడ అందురు.

8. ముహూర్త - ముహూర్తాభిమాన దేవతలు. వీరు జీవులకు ఆయా ముహూర్తములయందు వారి వారి కర్మలననుసరించి ఫలితములను ఇచ్చుచుందురు.

9. సంకల్ప - సంకల్పుడు - కాముడు

10. వసువు - 8 మంది వసువులు. ఆ 8 మంది పేర్లు వారి భార్యలు, కుమారులు ఎవరనగా -

1. ద్రోణుడు - పత్నిపేరు అభిమతి. హర్ష, శోక, భయాదుల అభిమాన దేవతలు వీరి సంతానము.

2. ప్రాణుడు - భార్యపేరు ఊర్జస్వతి. సహుడు, ఆయువు, పురోజవుడు వీరి ముగ్గురు కుమారులు.

3. ధ్రువుడు - పత్ని ధరణి. నగరముల అభిమాన దేవతలు వీరికి జన్మించిరి.

4. అర్కుడు - భార్య వాసన. తృష్ణ మొదలగువారు వీరికి జన్మించిరి.

5. అగ్ని - భార్య ధార. వీరికి ద్రవిణకుడు మొదలగు పెక్కు సంతానము కలిగిరి.

కృత్తిక పుత్రుడగు స్కంధుడు కూడా అగ్ని వలననే జన్మించెను. ఈస్కంధునకు విశాఖుడు మొదలగువారు కలిగిరి.

6.దోషుడు -భార్య శర్వరి. వీరికి శిశుమారుడు జన్మించెను.ఈతడు భగవంతుని యొక్క కళావతారము.

7. వసువు - భార్య అంగిరసి. ఈమె వలన శిల్పకళకు అధిపతియైన విశ్వకర్మ జన్మించెను. ఈ విశ్వకర్మకు ఆతని భార్యయైన కృతి వలన చాక్షుషమనువు జన్మించెను. ఈతనికి విశ్వేదేవతలు, సాధ్యగణములు జన్మించినారు.



Scanned with CamS

8. విభావసు - భార్య ఉష, వీరికి వ్యుష్టుడు, రోచిషుడు, ఆతపుడు జన్మించిరి. చివరివాడైన ఆతపునకు పంచయాముడు అను పుత్రుడు పుట్టెను. ఈతని వలననే సకల జీవులు తమ తమ కార్యములను నెరవేర్చు కొను చుందురు.

భూత ప్రజాపతికి దక్షప్రజాపతి ఇచ్చిన ఇద్దరు కన్యల పేర్లు వారి సంతానము:

**1.** సరూప : కోట్ల కొలది రుద్రగణములను కనెను. వారిలో ముఖ్యులు 11 మంది. 1.రైవతుడు 2. అజుడు,3.భవుడు, 4.భీముడు, 5.వాముడు, 6.ఉగ్రుడు, 7.వృషాకపి, 8.అజైక పాదుడు, 9. అహిర్బుద్న్యుడు, 10. బహురూపుడు, 11.మహంతుడు.

**2.** భూత - భయంకరుడైన భూతుడు, వినాయకుడు మున్నగువారు వీరి సంతాము. వీరందరూ 11 మంది రుద్రులలో ముఖ్యుడైన మహంతునకు పార్షదులైనారు.

అంగిరస ప్రజాపతి యొక్క ఇద్దరు భార్యలు 1.స్వధ, 2.సతి

స్వధ పితృ గణములకు జన్మనివ్వగా, సతి అధర్వాంగిరసము అను వేదమునే పుత్రునిగా కనెను.

**3.** కృశాశ్వ ప్రజాపతి భార్యలు . 1. అర్చి, 2. ధిషణ : అర్చి ధూమ్రకేసుని కనెను. ధిషణ 1.వేదశిరుడు. 2. దేవలుడు, 3.వయనుడు, 4.మనువు అను నలుగురు పుత్రులను కనెను.

**4.** తార్క్ష్య ప్రజాపతి యొక్క నలుగురు భార్యలు : 1. వినత, 2.కద్రువ, 3.పతంగి, 4. యామిని. వీరియందు వినత 1.అనూరుడు. 2.గరుత్మంతుడు అను పుత్రులను కనెను. అనూరుడు సూర్య భగవానునికి సారధి కాగా గరుత్మంతుడు విష్ణుమూర్తికి వాహన మయ్యెను.

పతంగి అను నామెకు పక్షులు జన్మించగా, యామిని అను దక్షకన్య మిడతలకు జన్మనిచ్చెను. కద్రువకు అనేకమంది నాగులు జన్మించిరి.



# అమృతానుభవము

**మూలం - శ్రీసంత్ జ్ఞానేశ్వర్ మహారాజ్** తెనుగు
- నైనారు అప్పాస్వామి

నిద్ర మేల్కొన్న మెలకువ నిలచియుండు
ఎరుకయేయున్న నిద్ర నీవెరుగ లేవు
నిద్ర మెలకువయను ద్వంద్వ నియతిరాదు
భ్రాంతి దొలగిన జ్ఞానమే భద్రమగును. 5

పూర్ణుడైయుండు చంద్రుడు పున్నమందు
తిమిర నిశలందు నారీతి తీరియుండు
తరుగ దాతని నిజరూపు తరచిచూడ
మరుగు పడుటయే గాని ఏమార్పురాదు. 6

అన్న మందుండి కలుగదా యర్కుకాంతి
చీకటుండదు సూర్యుని చెంతనెపుడు
రవికి సారూప్యమెంచగ రవియె యగును
వేరొకటి సూర్యుడన కడు వెర్రియగును. 7

భాసిలదు లోకదృష్టిచే ప్రజ్ఞయెపుడు
మందగించదు భ్రాంతిచే మహిత ప్రజ్ఞ
పరమమైనది జ్ఞానంబు ప్రజ్వలించు
దృష్టి వేరుగ నుండునే ద్రష్టకన్న ?. 8

ఇంద్రియార్జిత విషయంబు నెన్నగాను
జ్ఞానమనరాదు, నిత్యమై జ్ఞానమలరు
పూర్ణమది విశుద్ధమగుచు పొలయుచుండు
అనుభవైక వేద్యంబది యనగజెల్లు. 9

అంబరము తనలోపలికరుగ గలదె ?
తనను తానగ్ని దహియింప తరమె చూడ?
ఎవ్వడేనియు తనశిర మెక్క గలడె?
చూపు తనను తానెటులైని చూడ గలదె?. 10



Scanned with CamS

# చిందులు త్రొక్కు ప్రాణి

సదా మోహాటవ్యాం చరతి యువతీనాం కుచగిరౌ

నటత్యాశాశాఖాస్వటతి ఝటితి స్వైరమభితః

కపాలిన్ భిక్షో మే హృదయ కపి మత్యంతచపలం

దృఢం భక్త్యా బద్ధ్వా శివ భవదధీనం కురు విభో!

శ్రీ శంకరాచార్యులవారు తమ 'శివానందలహరి' అను గ్రంథంలో ఇలా వ్రాశారు -ఓ పరమశివా! అజ్ఞానమను కారడవిలో నిరంతరం తిరుగాడుచున్నదియు, విషయ భోగాలపై పరుగెత్తుచున్నదియు, ఆశలను చెట్టుకొమ్మలపై గంతులు వేస్తున్నదియు, ఇష్టం వచ్చినట్లు నలువైపుల పరుగెత్తుచున్నదియు అగు నా మనస్సును మహాచంచలమైన కోతిని భక్తి అను త్రాడుతో గట్టిగా కట్టివేసి తమ అధీనం చేసుకోండి మహాప్రభో!

చంచల వస్తువుల్లో కోతి అగ్రగణ్యమైంది. అది ఒక్క క్షణకాలం కూడ ఊరికే యుండదు. మనస్సు కూడా అటువంటిదే. ఈ స్థితి దానికి ఒక్క జన్మలో వచ్చింది కాదు. అనేక జన్మల్లో అది విషయాల్లో తిరుగాడి తిరుగాడి చంచలత్వాన్ని స్వభావంగా చేసుకొంది. అది నిశ్చలంగా వుండాలంటే దానికి ఇష్టమైన పరమానందం ఎక్కడున్నదో అక్కడకు దాన్ని చేర్చాలి.

అదే భగవంతుని పాదపద్మాలు. అదే పరమాత్మ. అదే పరబ్రహ్మం. పరమాత్మ మనస్సుకు పుట్టిల్లు. మనస్సును పుట్టింటికి చేరిస్తేనే అది దాని గంతుల్ని విడనాడి ఏకధాటిగ బ్రహ్మానందాన్ని అనుభవిస్తూ కూర్చుంటుంది. పరమాత్మలో లయమైపోతుంది. తన నామరూపాలను పోగొట్టుకొని, తన అజ్ఞానానికి తిలోదకాలిచ్చి, తన బహుకాల కర్మబంధాన్ని త్రెంచేసి మోక్షసుఖమును అనుభవిస్తూంటుంది. దాన్నే పెద్దలు సమాధి స్థితి అంటారు. తురీయము అని కూడా చెప్తూంటారు.



అట్టి తురీయస్థితిని పొందటమే జీవుని చరమ లక్ష్యం. కాబట్టి ఓ జీవుడా ! భక్తి జ్ఞాన వైరాగ్యాదులద్వారా, పుణ్యకర్మాచరణ ద్వారా, నిష్కామక్రియల ద్వారా మనస్సునందలి మాలిన్యాన్ని పోగొట్టుకొని, రజోగుణ, తమోగుణాలను వదలివేసి విశుద్ధ సత్వాన్ని స్వీకరించి, మనస్సులోని కఠినత్వాన్ని పారద్రోలి దాన్ని నవనీతంగా తయారు చేసుకో, భక్తిని అభివృద్ధి చేసుకో. భగవంతుని పాదపద్మాల వద్దకు చేరుకో. ఇక నీ జన్మ సార్థకమై పోతుంది. నీవు ధన్యుడవౌతావు.

- శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు

# వాదన - వేదన

- డా॥ పులివర్తి కృష్ణమూర్తి

వేదం నుండి వాదన పుట్టిందా
అయితే వాదన నుండే సత్యం
వెలుగు చూడాలి
మాటల్లో సత్యం కనిపించాలి
వాక్కు పవిత్రం అతి పవిత్రం
వాగ్భూషణమే అసలైన భూషణం
వాక్కు నుండే అమృతం పుడుతుంది
వాక్కు నుండే అగ్నికణాలు రాలతాయి
కొందరి మాటలు కోటలు దాటితే
కాళ్ళు మాత్రం గడపదాటవు
మన మాటలు అమృతం కురవాలి
విన్నవారికి స్వాంతన చేకూర్చాలి
చెప్పింది చేసిన వాడే లోకంలో ధన్యుడు
సత్యవాక్కు, ధర్మాచరణం
దైవానికి ప్రీతికరం సదా!



Scanned with CamS

## వార్తలు

**(01).** జూన్ 5వ తేది శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ఆశ్రమంలో గురుపాదుకలకు పూజ చేయబడింది.

**(02).** జూన్ 19వ తేది కృత్తిక సందర్భంగా ఆశ్రమ శివాయంలోని సుబ్రహ్మణ్య స్వామికి ప్రదోషకాలంలో అభిషేకం, అర్చన చేయబడినది.

**(03).** జూన్ 20వ తేది మాసశివరాత్రి సందర్భంగా ఆశ్రమ శివాలయంలోని నర్మదేశ్వరునకు ప్రదోషకాలంలో రుద్రాభిషేకం, బిల్వార్చన చేయబడినది.

**(4).** 28-05-2020 తేది శ్రీశుకబ్రహ్మాశ్రమ పరిపాలనా సంఘ సమావేశం ఉదయం 7 గంటలకు జరిగినది.

**(05).** 28-05-2020 తేది త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు బోర్డు సమావేశం శ్రీశుకబ్రహ్మాశ్రమంలో ఉదయం 10 గంటలకు జరిగినది. కరోనా తీవ్రత వలన ఆశ్రమ కన్నప్ప కంటి ఆసుపత్రిని జూన్ నెలంతా మూసి వేయుటకు తీర్మానించడమైనది.

**(06).** ఆశ్రమ కంటి ఆసుపత్రిలో 2019-2020 ఆర్థిక సంవత్సరంలో ఓ.పి.విభాగంలో 10667 మందికి కంటి పరీక్షలు జరిపి తగు చికిత్సలు చేయబడినవి. 933 మందికి కళ్ళలో పొరలను తొలగించి లెన్సు అమర్చబడినవి. 67 మందికి యాగ్ లేజర్ చికిత్సలు చేయబడినవి. 36 గ్రామాలలో కంటి వైద్య శిబిరాలు నిర్వహింపబడినవి. ఇవన్నీ ఉచితంగానే చేయబడినవి. దీనికి ఖర్చును త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుచే చేయబడినది. ఇందు నిమిత్తం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.25,19,378/- లను త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు ఖర్చు పెట్టినది.

**(07).** జూన్ 7వ తేది సద్గురు సర్వసేవాట్రస్టుబోర్డు సమావేశం ఉదయం 8 గంటలకు ఆశ్రమ ఆనందకుటీరంలో జరిగినది. అందు 2019-2020 జమా ఖర్చుల పరిశీలన ఆమోదం, 2020-2021 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఆమోదం జరిగినది.



## పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి రచనలు చదవండి, చదివించండి.

| | | రూ. |
|---|---|---|
| 1. | గీతామకరందము (తెలుగు) | 400.00 |
| 2. | గీతామకరందము (ఇంగ్లీషు) | 450.00 |
| 3. | యోగవాశిష్ఠ రత్నాకరము | 300.00 |
| 4. | రామాయణ రత్నాకరము | 300.00 |
| 5. | భాగవతరత్నాకరము | 300.00 |
| 6. | భారతరత్నాకరము | 300.00 |
| 7. | ఉపనిషద్రత్నాకరము | 150.00 |
| 8. | మోక్షసాధనరహస్యము | 100.00 |
| 9. | The Secret of Liberation | 200.00 |
| 10. | గీతోపన్యాసములు | 120.00 |
| 11. | Lecturers on Geetha | 200.00 |
| 12. | బ్రహ్మచర్యవిజయము | 60.00 |
| 13. | బ్రహ్మానంద వైభవము | 30.00 |
| 14. | ఆత్మానుసంధానము | 50.00 |
| 15. | అమృతబిందువు | 60.00 |
| 16. | స్థూలాక్షరి తాత్పర్యగీత | 70.00 |
| 17. | పరమార్థ కథలు | 120.00 |
| 18. | స్వాములవారి జీవిత చరిత్ర | 100.00 |
| 19. | ఉపనిషత్ కథలు | 40.00 |

గ్రంథములు కావలసిన వారు పైకనిన ప్రకారము వీటి ధరలను ఎం.ఓ. ద్వారాగానీ, చెక్కు ద్వారా గాని, శ్రీ శుకబ్రహ్మాశ్రమము, శ్రీశుకబ్రహ్మాశ్రమము పోస్టు, శ్రీకాళహస్తి -517 640 అను చిరునామాకు పంపగలరు.

Scanned with CamS

Regd.No. TRP / 123 / 2018 - 20 July 2020 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-06-2020, Permitted to post : 29th, 30th every month.

# త్రినేత్ర వైద్యాలయము

# భక్తకన్నప్ప కంటి ఆసుపత్రి.

శ్రీ శుకబ్రహ్మాశ్రమము, స్వామి ప్రకాశానందనగర్, శ్రీకాళహస్తి, ఆం.ప్ర.

ఆపరేషన్ థియేటర్‌లో కంటి ఆపరేషన్ చేయుట

ఈ పేజీ స్థల దాతలు

**సుభద్రా చారిటబుల్ ట్రస్టు**

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం




Scanned with CamS